క్లుప్తంగా

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ


పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాలను అందిస్తున్న కేటీ బాబు దంపతులు

కర్నూలు(అర్బన్): తెలుగు సంవత్సరాది ఉగాది, పవిత్ర రంజాన్ పండుగలను పురస్కరించుకొని బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్న కర్నూలుకు చెందిన వీర విశ్వచైతన్య, కవిత దంపతులు పారిశుద్ధ్య కార్మికుల పట్ల ధాతృత్వాన్ని చాటుకున్నారు. గురువారం సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల తల్లిదండ్రులు రిటైర్డు బీసీ వసతి గృహ సంక్షేమాధికారి కేటీ బాబు, రమాదేవి ద్వారా పారిశుద్ధ్య కార్మికుల సేవలను కొనియాడుతూ వారికి నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికుల సేవలను ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు.

జయప్రదం చేయండి



ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల లోగోను ఆవిష్కరిస్తున్న ఎన్.లెనిన్‌బాబు

కర్నూలు(సెంట్రల్): మే 15 నుంచి 18వ తేదీ వరకు తిరుపతిలో జరిగే ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జాతీయ కార్యదర్శి ఎన్.లెనిన్‌బాబు పిలుపునిచ్చారు. గురువారం సీఆర్ భవన్‌లో జాతీయ మహాసభలకు సంబంధించిన లోగోను ఆయన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాములు, శ్రీనివాసులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ మహాసభల్లో భాగంగా మొదటిరోజు వేలాది మందితో బహిరంగ సభ ఉంటుందన్నారు. అనంతరం వెయ్యి మందితో కలసి ప్రతినిధుల సభ ఉంటుందన్నారు. మూడు రోజులపాటు నిరుద్యోగంపై సుదీర్ఘంగా చర్చించి భగత్ సింగ్ నేషనల్ గ్యారంటీ ఎంప్లాయ్‌మెంట్ యాక్ట్‌ను తేవాలని తీర్మానం చేయనున్నట్లు చెప్పారు.

కథలు, పాటల రచన పోటీలు

కర్నూలు కల్చరల్: ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే పురస్కరించుకొని ప్రజాశక్తి సాహితీ సంస్థ ఆధ్వర్యంలో కథలు, పాటల రచన పోటీలు - 2025కు రచనలను ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కథల పోటీలో ప్రథమ బహుమతి రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.5 వేలు, తృతీయ బహుమతి రూ.3 వేలు పాటల రచనల పోటీలో ప్రథమ బహుమతి రూ.5 వేలు,ద్వితీయ బహుమతి రూ.3 వేలు, తృతీయ బహుమతి రూ.2 వేలు నగదు బహుమతులు ఉంటాయని పేర్కొన్నారు. సామాజిక స్పృహతో కూడిన రచనలు ఉండాలని పేర్కొన్నారు. ప్రజా శక్తి సాహితీ సంస్థ మేడే కథలు, పాటల రచన పోటీ 2025, ప్రజా శక్తి భవన్, డోర్ నంబర్ 12-402/1/1, అమరారెడ్డి కాలనీ, అరవిందా హైస్కూల్ వద్ద, తాడేపల్లి -522501 చిరునామాకు ఏప్రిల్ 25 లోగా రచనలు పంపాలని పేర్కొన్నారు.

దంత శుభ్రతపై అవగాహన పెరగాలి

కర్నూలు (హాస్పిటల్): దంత శుభ్రతపై పిల్లలు అవగాహన పెంచుకోవాలని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాయలసీమ బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కిశోర్, డాక్టర్ ఆర్.రామచంద్రారెడ్డి సూచించారు. ప్రపంచ నోటి ఆరోగ్య దినం సందర్భంగా గురువారం స్థానిక కేవీఆర్ గార్డెన్‌లోని మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు దంత ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. నోటి దుర్వాసన, చిగుర్ల జబ్బులు, చిగుర్ల నుంచి రక్తస్రావం తదితర అంశాలపై వివరించారు. నోరు అన్ని ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుందని, చిగుర్ల జబ్బు వల్ల డయాబెటిస్, గుండె జబ్బులు, ఊపిరితిత్తుల జబ్బులు, నోటి క్యాన్సర్ వస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ రోజుకు రెండుసార్లు దంతాలను పేస్ట్‌తో శుభ్రం చేసుకోవాలని, ఏదైనా తిన్నప్పుడు నోటిని పుక్కిలించాలని, తీపి పదార్థాలు, చల్లటి పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ నరేష్, డాక్టర్ సతీష్, డాక్టర్ నౌషాద్ తదితరులు పాల్గొన్నారు.

క్లాప్ ఆటోలను పునరుద్ధరించాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలో చెత్తను సేకరించే క్లీన్ ఏపీ (క్లాప్) ఆటోలను పునరుద్ధరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో 100 క్లాప్ ఆటోలను చెత్త సేకరణ కోసం ఓ ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా ఏర్పాటు చేశారన్నారు. మూడేళ్ల పాటు ఆటోలు ప్రజలకు ఇబ్బంది లేకుండా ఇళ్ల వద్దకే వెళ్లి చెత్తను సేకరించాయన్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఆటోలను నిలుపుదల చేయడంతో వీధుల్లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతోందన్నారు. ఫలితంగా ఏ వీధిలో చూసినా దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ముఖ్యంగా దోమలు వృద్ధి చెంది మలేరియా, టైఫాయిడ్ బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో చెత్త ఆటోలను మళ్లీ పునరుద్ధించాలని, లేకపోతే ఇబ్బందులు తప్పవని, ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. లేదంటే సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు.

బకాయిలు చెల్లించకుంటే సేవలు బంద్

- అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ
- ఐదుగురు ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు


పన్ను వసూలు చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థకు ఆస్తి, నీటి పన్నులు చెల్లించకుంటే సేవలు నిలిపివేస్తామని అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ స్పష్టం చేశారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెలాఖరు 31వ తేదీ నాటికి 2024-25 ఆర్థిక సంవత్సరం ముగుస్తుందన్నారు. నగర పరిధిలో నివశిస్తున్న యజమానులు తమ ఆస్తి, నీటి పన్నులను వెంటనే చెల్లించాలన్నారు. బకాయిలు చెల్లించకుంటే చట్టపరమైన చర్యలు, వాణిజ్య సముదాయ దుకాణాల సీజ్, గృహాలకు తాగునీటి కుళాయి కనెక్షన్ కట్ వంటి నగరపాలక సేవలు నిలిపి వేస్తామని స్పష్టం చేశారు. సకాలంలో పన్నులు చెల్లించని వారు పన్నుపై ప్రతి రూ.100కు రెండు రూపాయలు ఆలస్య రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభమవుతుందని, జూన్ వరకు డిమాండ్ నోటీసులు పంపిణీ చేస్తామని చెప్పారు. ప్రతి ఏటా డిసెంబర్ నెల నుంచి పన్ను వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 1,16,305 ఆస్తి పన్ను అసెస్‌మెంట్లకు సంబంధించి రూ.58.74 కోట్లు, తాగునీటి కుళాయి పన్నులకు సంబంధించి 66,897 అసెస్‌మెంట్లపై రూ.10.42 కోట్లు, 11,222 ట్రేడ్ లైసెన్సులకు సంబంధించి రూ.1.08 కోట్ల పన్నులు వసూలు చేసినట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ వంద శాతం పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి దోహదపడాలని కోరారు.

సచివాలయాల ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

మార్చి నెల ముగుస్తున్నా పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న ఐదుగురు సచివాలయాల ఉద్యోగులకు గురువారం నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మాధవీనగర్ సచివాలయం (కె.నరేష్), తారకరామ నగర్ సచివాలయం (జి.మద్దిలేటి), అయ్యప్పనగర్ సచివాలయం (కురువ యశోదకుమారి), రాజీవ్ గృహకల్ప సచివాలయం (కె.పరందాముడు), పెద్దపాడు సచివాలయం (పి.రామకృష్ణ) కు నోటీసులు జారీ చేశారు. 24 గంటల వ్యవధిలో లిఖిత పూర్వకంగా సమాధానం తెలియజేయాలని లేని పక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై సర్కారు నిర్లక్ష్యం



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి

కర్నూలు సిటీ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు దాటినా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తోందని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి అన్నారు. ఆయన గురువారం స్థానిక సలాం ఖాన్ భవనంలో ఏర్పాటు చేసిన ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ప్రసంగించారు. ఎన్నికల సమయంలో.. అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగులకు మెరుగైన పీఆర్‌సీ ఇస్తామని కూటమి నేతలు చెప్పారని, అయితే 9 నెలలు దాటినా కనీసం 12వ పీఆర్‌సీ కమీషన్‌ను కూడా నియమించలేదన్నారు. మధ్యంతర భృతి, పెండింగ్ బకాయిలు చెల్లింపు హామీలను ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. సీపీఎస్, జీపీఎస్‌లను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. జీఓ 117ను రద్దు చేయాలన్నారు. పదో తరగతి పరీక్షల విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను చిన్న చిన్న కారణాలను చూపి సస్పెండ్ చేస్తున్నారని ఇది తగదన్నారు. ఏప్రిల్, మే నెలల్లో జరగనున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి టి.కే జనార్ధన్, రాష్ట్ర మాజీ కార్యదర్శి మహమ్మద్ షఫీ, దేవదాసు, ఇస్మాయిల్, సాహెబ్, అబ్దుల్ రహీం, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

కర్నూలు (సెంట్రల్): కర్నూలు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులైన మహేంద్ర నాయుడు పదవీ బాధ్యతలు చేపట్టారు. గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నగర అధ్యక్షుడు జిలానీ బాషా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ యూత్ కాంగ్రెస్ కార్యదర్శి మమతా నాగిరెడ్డి, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్కరాజు రామారావు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని మహేంద్ర నాయుడు ఈ సందర్భంగా చెప్పారు. కార్యక్రమంలో పత్తికొండ, కోడుమూరు ఇన్‌చార్జ్‌లు క్రాంతినాయుడు, అనంతరత్నం మాదిగ, మాజీ ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణ గుప్త, సయ్యద్ నవీద్ పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు


మాట్లాడుతున్న ఎక్సైజ్ మెజిస్ట్రేట్ జి.సరోజమ్మ

కర్నూలు సిటీ: న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పసుపుల జెడ్పీ హైస్కూల్‌లో పోక్సో చట్టంపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.ఎక్సైజ్ మేజిస్ట్రేట్ జి.సరోజమ్మ హాజరై ప్రసంగించారు. రక్షణ చట్టం 2012 ప్రకారం పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. 18 ఏళ్ల వయస్సులోపు బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడకుండా పోక్సో యాక్ట్ నిరోధిస్తుందన్నారు. పోక్సో కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక కోర్టులు ఉన్నాయని చెప్పారు. లైంగిక వేధింపులకు సబంధించి చట్టాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. అనంతరం తాలుకా ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి వివిధ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్‌ఎం విజయమ్మ, టీచర్లు పాల్గొన్నారు.

కూటమి పాలనలో దళితులకు రక్షణ కరువు


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీఎస్పీ నాయకులు

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వంలో దళితులకు రక్షణ కరువైందని బహుజన సమాజ్‌వాదీ పార్టీ కర్నూలు నగర కన్వీనర్ రాజ్‌కుమార్ అంబేడ్కర్ ఆవేదన వ్యక్తంచేశారు. ఇటీవల కర్నూలు నగరంలోని శరీన్‌నగర్‌కు చెందిన దళిత నేత కాశపోగు సంజన్నను రౌడీషీటర్ హత్య చేసిన సంఘటనే నిదర్శనమన్నారు. గురువారం బీఎస్పీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాశపోగు సంజన్నను చంపిన దుండగులకు ఉరి శిక్ష పడేలా చేయాలన్నారు. మరోవైపు జిల్లాలో అన్ని మండలాల్లో దళితులపై దాడులు జరుగుతున్నాయన్నారు. పోలీసు స్టేషన్లలో ఎస్సీ, ఎస్టీ కేసులను నమోదు చేయడం లేదన్నారు. బాధితులకు పరిహారం అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో సుధాకర్, నరేష్, రామాంజనేయులు పాల్గొన్నారు.

చెత్త సేకరణలో కార్పొరేషన్ విఫలం



10వ వార్డులో ప్రజా చైతన్య యాత్ర నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలో చెత్త సేకరణలో మునిసిపల్ కార్పొరేషన్ విఫలమైందని ప్రజా చైతన్య యాత్రల్లో సీపీఎం నాయకులు విమర్శలు గుప్పించారు. గురువారం సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు అబ్దుల్ దేశాయ్, కె.రామకృష్ణ, ఎస్‌ఎండీ షరీఫ్ ఆధ్వర్యంలో 9, 10, 11 వార్డుల్లో, కె.సుధాకరప్ప, జి.ధనలక్ష్మి ఆధ్వర్యంలో 35వ వార్డులో ప్రజా చైతన్యయాత్రలను నిర్వహించారు. ఎక్కడ చూసినా చెత్త పేరుకుపోయినా తరలించకుండా మునిసిపల్ కార్పొరేషన్ ఏమి చేస్తోందని ప్రశ్నించారు. కర్నూలు నగరం చెత్తమయంగా మారిందని, మరోవైపు ప్రజల నుంచి పన్నులను ముక్కు పిండి వసూలు చేస్తున్నా అభివృద్ధి మాత్రం కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కర్నూలు నగరంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 26న మునిసిపల్ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు చెప్పారు.

రేపు డిప్యూటీ సీఎం పర్యటన

కల్లూరు: డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ శనివారం ఓర్వకల్లు మండలంలో పర్యటించనున్నారని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి తెలిపారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కూటమి పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పర్యటనలో భాగంగా ఓర్వకల్లు మండలంలో పూడిచెర్ల వద్ద జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఫారంపాండ్స్ నిర్మాణానికి భూమిపూజ చేస్తారన్నారు. కార్యకర్తలు, నాయకులు డిప్యూటీ సీఎం పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కూటమి పార్టీల నేతలు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ముగ్గురికి తీవ్ర గాయాలు

- మరో ఎనిమిది మందికి స్వల్ప గాయాలు
- బాధిత కూలీలంతా అగ్రహారం గ్రామస్తులే..
- బాపురం పొలాల్లో మిరప కోతలకు వెళ్తుండగా హాలహర్వి వద్ద ఘటన


గాయపడిన యువతి ఐశ్వర్య


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాధమ్మ

ఆలూరు రూరల్: వ్యవసాయ కూలీలతో వెళ్తున్న ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో ముగ్గురు కూలీలు తీవ్రంగా గాయపడగా ఎనిమిది మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఆటోలో వెళ్తున్న కూలీలంతా మండలంలోని అగ్రహారం గ్రామానికి చెందిన వారే. గురువారం ఉదయం హాలహర్వి మండల కేంద్రానికి సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. బాధితుల బంధువులు తెలిపిన మేరకు వివరాలు.. మండలంలోని అగ్రహారం గ్రామానికి చెందిన 13 మంది వ్యవసాయ కూలీలు హాలహర్వి మండలం బాపురం గ్రామంలో మిరప పంట కోతలకు ఆప్పీ ప్యాసింజర్ ఆటోలో బయలుదేరారు. ఉదయం 7 గంటల సమయంలో హైవే 167లో ఉన్న హాలహర్వి పెట్రోల్ పంపు వద్ద ఆటో అదుపు తప్పి కిందపడింది. ప్రమాదంలో ఐశ్వర్య,రాధమ్మ, లింగమ్మ తలలకు తీవ్రగాయాలయ్యాయి. విజయలక్ష్మితో పాటు ఏడుగురు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం ఆదోని ఏరియా ఆసుపత్రికి రెఫర్ చేశారు.

బైకులు ఢీ.. వ్యక్తికి తీవ్రగాయాలు


గాయపడిన నాగరాజు

బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో నాగరాజు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గురువారం సాయంత్రం ఆలూరు సమీపంలోని పాండురంగ స్వామి ఆలయ వద్ద ప్రమాదం చోటు చేసుకుంది. వివరాలు.. హాలహర్వి మండలం మాచనూరు గ్రామానికి చెందిన నాగరాజు పని నిమిత్తం ఆలూరుకు వచ్చి స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా ఆలూరుకు చెందిన వీరేష్ ఆలూరు వైపు బైక్‌పై వస్తుండగా రెండు మోటారు సైకిళ్లు బలంగా ఢీకొన్నాయి. ప్రమాదంలో నాగరాజు తలకు తీవ్ర గాయాలవగా.. వీరేష్ స్వల్పంగా గాయపడ్డాడు. క్షతగాత్రులను స్థానికులు ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు నాగరాజును మెరుగైన వైద్యం కోసం బళ్లారి ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు.

పరిశుభ్రతపై అవగాహన

కల్లూరు: మండల పరిధిలోని సల్కాపురం గ్రామంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు ప్రత్యేక క్యాంపు నిర్వహించారు. గురువారం నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ మంజుల రాణి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ అన్నపూర్ణ, నాగరత్న, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'కవిత్వంతో కాసేపు'

కర్నూలు కల్చరల్: ప్రపంచ కవితా దినోత్సవం పురస్కరించుకొని సాహితీ స్రవంతి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో 'కవిత్వంతో కాసేపు' కార్యక్రమం నిర్వహించనున్నట్లు సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు ఆవుల బసప్ప తెలిపారు. జిల్లాలో ప్రముఖులైన 10 మంది కవులు తమ కవిత్వ అంతరంగాన్ని వివరిస్తారని పేర్కొన్నారు.

నేడు సమావేశాలు

కర్నూలు(సెంట్రల్): ఏపీజేఏసీ అమరావతి జిల్లా కమిటీ సమావేశం శుక్రవారం ఉదయం 10 గంటలకు, ఏపీఆర్ఎస్ఏ జిల్లా కమిటీ సమావేశం సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్నట్లు ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నా గరాజు, లక్ష్మీరాజు గురువారం ఓ ప్రకటలో తెలిపారు. ఆయా సమావేశాలు కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించనున్నట్లు వివరించారు. ఆయా సమావేశాలకు ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీజేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు హాజరుకానున్నట్లు వెల్లడించారు.

ఫ్లోరోసిస్‌పై అవగాహన


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డాక్టర్ సుధాకర్

కల్లూరు: జాతీయ ఫ్లోరోసిస్ నివారణ, నియంత్రణ కార్యక్రమంలో భాగంగా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్ చిన్నటేకూరులో గురువారం ఫ్లోరోసిస్ వలన కలిగే సమస్యలపై అవగాహన కల్పించారు. అనంతరం పోస్టర్లు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సాధారణంగా ఒక లీటర్ నీటికి ఫ్లోరైడ్ 1.5 పీపీఎం (పార్ట్సపెర్ మిలియన్) కన్నా ఎక్కువ ఉండకూడదన్నారు. ఫ్లోరైడ్ నీటిని తాగడం వలన దంతాలు పసుపు, గోధుమ రంగులోకి మారతాయన్నారు. కిడ్నీ సంబంధిత వ్యాధులు, ఎముకలు బోలుగా మారడం, వంగిపోయిన కీళ్లు, కండరాల బలహీనత, పిల్లల పెరుగుదలపై ప్రభావం చూపుతుందన్నారు. అలాగే బీడీ, చుట్ట, పాన్, పాన్ మసాలా వంటివి ఉపయోగించడం వలన ఫ్లోరోసిస్ సంబంధిత ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. కాల్షియం, విటమిన్-సి, ఉన్న ఆహారాన్ని పాలు, గుడ్డు, రాగిజావ, ఆకుకూరాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు బిందు, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

శాలిమియ్య మసీదులో ఎస్వీ ప్రార్థనలు


మసీదులో ప్రార్థన చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు (టౌన్): నగరంలోని 9వ వార్డు గఫార్ వీధిలో ఉన్న శాలిమియ్య మసీదులో గురువారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి రంజాన్ మాసం పురస్కరించుకొని ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఇఫ్తారు విందులో పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ఆధ్వర్యంలో..

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శిగా ఎన్నికైన సలీం బాషా గురువారం సాయంత్రం స్థానిక గిప్సన్ కాలనీలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, సహకార కేంద్ర బ్యాంకు మాజీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరిలకు శాలువాలు కప్పి గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్వీ మాట్లాడుతూ.. పార్టీ సూచించిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలన్నారు. సలీం బాషా మాట్లాడుతూ.. కర్నూలు నగరంలో వైఎస్సార్‌సీపీకి ఆదరణ పెరుగుతోందన్నారు. ముస్లిం సామాజిక వర్గం ఎస్వీ వెంట ఉందని స్పష్టం చేశారు. పార్టీ అభివృద్ధికి తమ వంతుగా కృషి చేస్తామన్నారు. ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఇఫ్తార్ విందు

కర్నూలు (హాస్పిటల్): నగరంలోని బిర్లా గడ్డ మసీదులో గురువారం ఉపవాసం ఉంటున్న ముస్లింలకు జీఎస్ఆర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్ అధినేత డాక్టర్ నాగేశ్వరయ్య మాట్లాడుతూ.. ముస్లింలు నెల రోజుల పాటు ఎంతో పవిత్రంగా ఉపవాసం ఉండి రంజాన్ పండుగను జరుపుకుంటారన్నారు. హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


మహమ్మద్ రఫీ, షేక్ అశ్రావుల్

కర్నూలు (టౌన్): ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు బీహార్ రాష్ట్రంలోని జహీరాబాదులో నిర్వహించనున్న 46వ జాతీయ స్థాయి జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపికైన హ్యాండ్‌బాల్ క్రీడాకారులు మహమ్మద్ రఫీ, షేక్ అశ్రావుల్‌ను గురువారం జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, హ్యాండ్‌బాల్ సంఘం జిల్లా కార్యదర్శి సువర్ణ అభినందించారు.

కమనీయం.. లక్ష్మీమాధవుడి రథోత్సవం


అశేష జనవాహిని మధ్య ముందుకు తరలుతున్న లక్ష్మీమాధవస్వామి రథం

- గోవింద నామస్మరణతో మార్మోగిన గోరంట్ల
- రథోత్సవ కార్యక్రమానికి తరలివచ్చిన అశేష జనవాహిని

కోడుమూరు రూరల్: కోడుమూరు మండలం గోరంట్లలో వెలసిన శ్రీలక్ష్మీ మాధవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం అశేష జనవాహిని మధ్య స్వామివారి రథోత్సవం కనులపండువగా సాగింది. రథోత్సవాన్ని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచే గాక కర్ణాటక, అనంతపురం, తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. వేదపండితుల మంత్రోచ్ఛరణ, మేళతాళాలతో శ్రీలక్ష్మీ, భూదేవి మాధవస్వామి విగ్రహాలను రథంపై ఆశీనులు చేయగా, భక్తుల గోవింద నామస్మరణ మధ్య రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. రథోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి స్వామి వారికి పూజలు నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా కోడుమూరు సీఐ తబ్రేజ్ ఆధ్వర్యంలో కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ ఎస్ఐలు శ్రీనివాసులు, తిమ్మయ్య, తిమ్మారెడ్డి తమ సిబ్బందితో గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు.

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు


బోసిరెడ్డి కాలనీలో పర్యటిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): నగర శివారు కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు స్పష్టం చేశారు. గురువారం స్థానిక పెద్దపాడు రోడ్డులోని బోసి రెడ్డి కాలనీ, పోలీసు కాలనీ ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీసు రెండవ పటాలపు అసిస్టెంట్ కమాండెంట్ మహబూబ్ బాషాతో కలిసి కాలనీల్లో నెలకొన్న సమస్యలపై చర్చించారు. రహదారులు, మురుగు కాల్వలు, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని రెండవ పటాలపు పోలీసులు కమిషనర్ దృష్టికి తీసుకు వచ్చారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. అత్యవసర పనులకు ప్రాధాన్యత ఇస్తూ ఒక్కొక్కటిగా సమస్యలను పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఎస్‌బీఐ ఎంప్లాయిస్ కాలనీ, అశోక్ నగర్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను కమిషనర్ తనిఖీ చేశారు.

ప్రపంచ అటవీ దినోత్సవ శుభాకాంక్షలు
- అడవులను, వన్యప్రాణులను సంరక్షించండి. - అడవులను అగ్ని ప్రమాదాల నుండి కాపాడడంలో సహకరించండి. - అడవిలో ఎటువంటి అగ్ని ప్రమాదాలు జరిగిన ఈ టోల్‌ఫ్రీ నెంబరుకు సంప్ర: 1800119334
కర్నూలు జిల్లా వాసులకు ఆహ్లాదం కొరకు అటవీశాఖ వారు 3 నగరవనాలను: గార్గేయపురం, పుల్లయ్య పార్క్, వెంగన్న బావి దగ్గర మరియు కోటకల్, ఆదోని దగ్గర అభివృద్ధి చేశారు.
శ్రీ పి.రంజిత్‌బాషా IAS జిల్లా కలెక్టర్ & మెజిస్ట్రేట్, కర్నూలు జిల్లా
శ్రీమతి ఆర్.యశోదబాయి IFS Conservator of Forests, Kurnool Circle
పి.శ్యామల, IFS
జిల్లా అటవీశాఖాధికారి మరియు అధికారులు

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కర్నూలు
70750 09182
Office mail : sakshiknladvt@gmail.com